చికెన్ ధర పతనం !

- లైవ్ బ్రాయిలర్ కోడి కేజీ రూ.65
- స్కిన్ రూ.140, స్కిన్‌లెస్ ధర రూ.170
- కార్తీక మాస ప్రభావమే కారణం !





హిందూపురం అర్బన్: ఓ వైపు కార్తీక మాసం.. మరో వైపు అయ్యప్ప స్వాముల దీక్ష ప్రభావంతో చికెన్ విక్రయాలు తగ్గాయి. దీంతో మార్కెట్‌లో బ్రాయిలర్ చికెన్ ధరలు గణనీయంగా పడిపోయాయి. లైవ్ కోడి ధర మూడేళ్ల కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఈ పరిణామంతో కోళ్ల ఉత్పత్తి కంపెనీలు, పౌల్ట్రీ నిర్వాహకులు, వ్యాపారులను తీవ్ర నిరాశకు గురి చేస్తుండగా.. మాంసాహార ప్రియులు మాత్రం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

300 నుంచి 180 టన్నులకు...

ఉమ్మడి అనంతపురము జిల్లా వ్యాప్తంగా ఎంతో మంది కోళ్ల పెంపకం చేస్తున్నారు. మామూలు రోజుల్లో నిత్యం 300 టన్నుల బ్రాయిలర్, లేయర్ కోళ్లు ఎగుమతి అవుతుండగా.. స్థానికంగానూ డిమాండ్ అధికంగా ఉండేది. వాతావరణం సానుకూలంగా ఉండటంతో ఇటీవల కోళ్ల ఉత్పత్తి కూడా పెరిగింది. అయితే కార్తీక మాసం, అయ్యప్ప స్వాముల దీక్షలు రావడంతో చికెన్‌కు ఒక్కసారిగా డిమాండ్ పడిపోయింది. దీంతో 180 టన్నుల వరకు మాత్రమే కోళ్ల ఫారాల నుంచి కోళ్ల ఎగుమతులు జరుగుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో విక్రయాలు లేకపోవడంతో ధరలు కూడా పడిపోయాయి.

లైవ్‌కోడి ధర తగ్గినా..

బహిరంగ మార్కెట్‌లో చికెన్ ధరలు తగ్గినా.. ఆ మేరకు విక్రయాలు మాత్రం పెరగడం లేదు. హోల్‌సేల్ వ్యాపారులు నెలక్రితం కిలో కోడి లైవ్ రూ.130 వరకు ఉండగా ప్రస్తుతం రూ.65–70కి పడిపోయింది. ఒక్కో కోడి 36 రోజుల పాటు కోళ్ల ఫారంలో పెంచితే 2 కిలోల వరకూ పెరుగుతుంది. అయితే ధరలు లేకపోవడంతో 45 రోజులైనా కోళ్లు ఎత్తక పోవడం , వాటి దాణా ఆహార వినియోగం పెరగడంతో కోళ్ల ఫారాల రైతులు సైతం నష్టాలపాల వ్వాల్సి వస్తోంది. బహిరంగ మార్కెట్‌లో బ్రాయిలర్ కోడి కిలో హోల్‌సేల్ ధర రూ.65 ఉండగా.. చికెన్ కేజీ స్కిన్‌తో రూ.140, స్కిన్‌లెస్‌తో రూ.170 వరకు విక్రయాలు జరుగుతున్నాయి. ఇదే పరిస్థితి మరో 20 రోజులు కొనసాగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

నష్టాల బాట..

వినియోగం భారీగా తగ్గడంతో కోళ్ల ఫారాల్లో 45 రోజులైనా కోళ్లు అలాగే ఉంచాల్సిన పరిస్థితి. ఒక్కో కోడి 2.5 నుంచి 3.5 కిలోల వరకు బరువు చేరుకున్నాయి. దాణా ఖర్చు రోజు రోజుకూ పెరుగుతుండటం, కోడి పిల్లలు ఇచ్చిన కంపెనీల వాళ్లు కోళ్లను తరలించకపోవడంతో అటు కంపెనీలు, ఇటు కోళ్ల ఫారాలు నిర్వాహకులు నష్టపోతున్నారు.

దిక్కుతోచని పరిస్థితి



బహిరంగ మార్కెట్‌లో చికెన్‌కు డిమాండ్ తగ్గింది. దీంతో కనిష్ఠ స్థాయికి ధరలు పడిపోయాయి. కోళ్ల అమ్మకాలు చేసే వ్యాపారులు, రైతులు, సరఫరా కంపెనీలు, చిరు వ్యాపారులకు సైతం నష్టం వాటిల్లుతోంది. ఏడాది పొడవునా కోళ్ల పెంపకంలో లాభాలు బాగానే వచ్చినా ప్రస్తుత పరిస్థితుల్లో నష్టపోవాల్సి వస్తోంది. ప్రస్తుతం దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నాం.

– ఆదినారాయణరెడ్డి, కోళ్ల ఫారం నిర్వాహకుడు

క్లుప్తంగా

క్షేత్రస్థాయిలో విచారించండి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చేతన్

హిందూపురం టౌన్: ఓటరు జాబితాలో క్లైమ్‌లు, ఆక్షేపణలపై త్వరితగతిన క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఆన్‌లైన్ దరఖాస్తులను లాగిన్ నుంచి క్లియర్ చేయాలని హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ చేతన్ ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఫోటో సిమిలర్ ఎంట్రీస్ మొత్తం 1080, డెమోగ్రాఫికల్ ఫిమేల్ ఎంట్రీస్ మొత్తం 866 ఉన్నాయని, వాటిని దరఖాస్తుదారులకు పోస్టల్ ద్వారా పంపించామన్నారు. ఓటరు నుంచి సమాచారం వచ్చిన తర్వాత వాటిపై చర్యలు తీసుకుంటామని వివరించారు. అనంతరం ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కౌంటర్, స్ట్రాంగ్ రూమ్‌ల కోసం ఎంజీఎం పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాలను తనిఖీ చేశారు.

ఐరన్ గేటు చోరీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని తడకలపల్లి సమీపంలో తన పొలం వద్ద ఏర్పాటు 15 అడుగుల చేసిన ఐరన్ గేటును సోమవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారని న్యాయవాది బాబునాయక్ మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాదాపు రూ.80 వేల నష్టం జరిగిందన్నారు.

సమన్వయంతో పనిచేయండి



అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశమైన పీడీ

పెనుకొండ రూరల్: నాడు–నేడు పనులను సమన్వయంతో పనిచేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక బాలికల పాఠశాలలో నాడు–నేడు పనులపై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలిచ్చారు.

పైలేరియాతో అప్రమత్తంగా ఉండాలి



రక్త నమూనాలను సేకరిస్తున్న దృశ్యం

పరిగి: పైలేరియా పై అందరూ అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూప రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కొడిగెనహళ్లి–2 సచివాలయ పరిధిలో మంగళవారం పలువురికి పైలేరియా గుర్తింపు కోసం రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలిచ్చారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



తేజాతో ఉపాధ్యాయ బృందం

పరిగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సి తేజ అనే విద్యార్థిని జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు కృపా సత్యరాజు తెలిపారు. డిసెంబర్‌లో జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో తేజా పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక పాఠశాలలో ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలంతో పాటూ హెచ్ఎం, పీడీ వినోద్ ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు.

పశువులతో నిరసన



పశువులతో నిరసన తెలుపుతున్న గోపాలప్ప

పావగడ: నిర్మించిన పశువుల షెడ్డుకు 4 సంవత్సరాలైనా బిల్లు చెల్లించకపోవడంతో విసిగి వేసారిన రైతు గోపాలప్ప మంగళవారం ఏకంగా పశువులనే గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి తోలుకెళ్లి నిరసన తెలిపారు. ఎన్ఎమ్ఆర్ , వర్క్ ఆర్డర్ సిద్ధంగా ఉన్నా రూ.42 వేల బిల్లు మాత్రం మంజూరు చేయలేదని గోపాలప్ప వాపోయాడు. పీడీఓ గంగాధర్, కంప్యూటర్ ఆపరేటర్ లింగరాజు వల్లే బిల్లు మంజూరు కాలేదన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వీడండి



రికార్డులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం టౌన్: అధికారులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వీడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయాన్ని చైర్‌పర్సన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ సెక్షన్లలో ఆమె పలు రికార్డులను పరిశీలించారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన

మడకశిర: పట్టణంలోని వివిధ వార్డుల్లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎస్సీ కాలనీలో జరుగుతున్న తాగునీటి పైప్‌లైన్ పనులను పరిశీలించారు. పనులను జాప్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ మురళి ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మడకశిర: మండలంలోని కల్లుమర్రి వద్ద మంగళవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్ చేయడంతో పాటు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ సీఐ భార్గవ్‌రెడ్డి తెలిపారు. గంతలపల్లి సమీపంలోని వంక నుంచి ఇసుక అక్రమంగా కల్లుమర్రికి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. 3 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

జగనన్నతోనే సంక్షేమాభివృద్ధి

- జోరుగా 'వై ఏపీ నీడ్స్ జగన్'
- సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న నాయకులు

లేపాక్షి: మండల పరిధిలోని కల్లూరు గ్రామ సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సర్పంచ్ వసుంధర అధ్యక్షతన నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ నీలావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, మండల అగ్రి బోర్డు చైర్మన్ ప్రభాకర్ పాల్గొని సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు.

హొన్నంపల్లిలో...

పరిగి: మండలంలోని హొన్నంపల్లి సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన జగనన్నే మళ్లీ అందరం కలసి సీఎంగా చేసుకోవాలని సర్పంచ్ మంజునాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీధర్ , వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీటీసీలు మారుతీరెడ్డి, చిక్కన్న, మాజీ సర్పంచ్ గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు బాబు చేసిందేమీలేదు

గుడిబండ: మండల పరిధిలోని కరికెర సచివాలయంలో సర్పంచ్ గౌరమ్మ అధ్యక్షతన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని మాట్లాడతూ అధికారం కోసం టీడీపీ అధినేత చంద్రబాబు అన్నీ అబద్ధాలే చెబుతున్నారని, ప్రజలకు ఆయన చేసింది ఏమీలేదని విమర్శించారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ భూతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్, జేసీఎస్ కన్వీనర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రం సచివాలయం దగ్గర...

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఛత్రం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సంక్షేమ పథకాల లబ్ధి పొందిన బోర్డును ప్రదర్శించారు. అనంతరం నాయకులు వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమ పాలన సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నయ్య, ఎంపీటీసీ హనుమంతరాయప్ప, మండల కన్వీనర్ రామిరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్, తాలుకా బూత్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, మండల ఎస్సీ సెల్ నాయకులు జమ్మానిపల్లి మూర్తి, మండల బూత్ మేనేజర్ మంజునాథ్, వివిధ కమిటీల సభ్యులు నాగభూషణ రెడ్డి, రంగనాథ్, నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రొద్దం మండలం దొడగట్ట సచివాలయంలో బోర్డు ప్రదర్శిస్తున్న దృశ్యం

వైఎస్సార్‌సీపీతోనే పేదలకు న్యాయం

రొళ్ల: రాష్ట్రంలో నిరుపేదలకు న్యాయం జరగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని హొట్టేబెట్ట సచివాలయం ఆవరణలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జెండాను నాయకులతో కలిసి ఎగురవేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర, వైస్ ఎంపీపీ రత్నమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు మోతీరాంనాయక్, ఎంపీటీసీ సభ్యుడు శివన్న, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంగంపల్లిలో...

గోరంట్ల: మండల పరిధిలోని గంగంపల్లి సచివాలయ ప్రాంగణంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సర్పంచ్ సుశీలమ్మ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకూ వెళ్లి పేదల సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు అయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు బాషా, వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసింహమూర్తి , గోరంట్ల సహకార సంఘం అధ్యక్షుడు శివశంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమరాపురం: డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ హనుమక్క



మడకశిర : మధుగిరి సర్కిల్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోడిపల్లిలో...

అగళి: మండల పరిధిలోని కోడిపల్లి గ్రామ సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి సంక్షేమ ఫలాల డిస్‌ప్లే బోర్డును నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రేణుక, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనివాస్, జేసీఎస్ ఇన్‌చార్జ్ శివన్న, సింగిల్ విండో అధ్యక్షుడు జయరామప్ప, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సమ న్యాయం

అమరాపురం: అన్ని వర్గాలకు సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సమ న్యాయం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ , ఎంపీపీ ఈరన్న, సర్పంచ్ హనుమక్క పేర్కొన్నారు. మండలంలోని హాలుకూరు సచివాలయం – 2 పరిధిలోని ఉదుగూరులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ లబ్ధి బోర్డును జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, జేసీఎస్ మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు.

మడకశిర పట్టణంలో..

మడకశిరరూరల్: రానున్న రోజుల్లో మరింతగా ప్రజలకు మేలు జరగాలంటే మరోమారు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ని చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పుట్ట కామప్ప తెలిపారు. మడకశిర నగర పంచాయతీలోని సాయినగర్ వార్డు సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ప్రజాప్రతినిధులు, నాయకులు సంక్షేమ పథకాల లబ్ధి పొందిన బోర్డును ప్రదర్శించారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు రామిరెడ్డి, కౌన్సిలర్ సుభద్ర, జిల్లా, మండల ఎస్సీ సెల్ నాయకులు జయరాజ్, మంజునాథ్, జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, కోఆప్షన్ సభ్యులు కృష్ణమూర్తి, పక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దొడగట్టలో...

రొద్దం: మండల పరిధిలోని దొడగట్ట గ్రామ సచివాలయం వద్ద మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ప్రదర్శించారు. గ్రామంలో సచివాయలం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు. ఎంపీపీ చంద్రశేఖర్, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఎంపీటీసీ బాలాజీ, సర్పంచ్ వనజ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతిరెడ్డి, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాలకూరులో...

సోమందేపల్లి: వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం చాలకూరు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించి డిస్‌ప్లేను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనరసప్ప, సింగిల్‌విండో చైర్మన్ ఆదినారాయణరెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, పరంధామ, షఫీ, రామాంజినేయులు, సచివాలయ కన్వీనర్ ఇమామ్‌వలి, తదితరులు పాల్గొన్నారు. రాత్రికి పల్లెనిద్ర చేశారు.



హిందూపురం: మా నమ్మకం నువ్వే జగన్ కిట్లను అందజేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీఎన్ దీపిక

మళ్లీ జగనే రావాలి

హిందూపురం టౌన్: రాష్ట్రంలోని పేద ప్రజల బాగు కోసం మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. మంగళవారం పట్టణంలోని కోట ఏరియా 28వ వార్డు సచివాలయ పరిధిలో కౌన్సిలర్ మల్లికార్జున అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద పార్టీ జెండాను ఎగురవేసి, సంక్షేమ లబ్ధి బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ దీపిక మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కోట ఏరియా–2లో డీబీటీ కింద రూ.8,30,59,703, అలాగే నాన్ డీబీటీ కింద రూ.6,89,85,019 మొత్తం రూ.15.20 కోట్లు ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్ర ప్రజలంతా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఈ సంతోషం ఇలాగే కొనసాగాలంటే జగనన్న మళ్లీ సీఎం కావాల్సిందేనని తెలిపారు. కార్యక్రమంలో ఏ బ్లాక్ కన్వీనర్ సీపీసీ సాధిక్, జేసీఎస్ కన్వీనర్ నౌషాద్, శివశంకర్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జ్‌లు కవిత, డిష్ చాంద్, దాదు, నాయకులు సహేరా భాను, రఘురాం, శివన్న, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: మండలంలోని దేమకేతేపల్లి సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, సర్పంచ్ తిరుమలేష్, మండల కన్వీనర్ ప్రభాకరరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ హనుమంతరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'పై అవగాహన

అమరాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రాపై ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మునిస్వామి ఆధ్వర్యంలో మండలంలోని పీడీలు, వలంటీర్లు, సచివాలయం సిబ్బందికి అవగాహన కల్పించారు. 15 ఏళ్లు నిండిన వారందరూ క్రీడా పోటీల్లో పాల్గొన వచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారితో రిజిస్ట్రేషన్లు చేయించాలని సూచించారు.

రొద్దం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కేశవరెడ్డి, పీడీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మడకశిర: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ భాస్కర్ కోరారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని వలంటీర్ల సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 13 వరకూ ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యే క్రీడాకారుల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.



రొద్దం: ఆడుదాం ఆంధ్రాపై సమీక్షిస్తున్న అధికారులు

శుద్ధి జల ప్లాంట్ ప్రారంభం



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

గోరంట్ల: మండల పరిధిలోని వానవోలు తండా గ్రామంలో మండల పరిషత్ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన శుద్ధి జల ప్లాంట్‌ను సర్పంచ్ పార్వతీబాయితో కలసి జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాంనాయక్ మంగళవారం ప్రారంభించారు. ప్రజలకు ఫ్లోరైడ్ రహిత మంచినీటిని అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యాన పంటలు లాభదాయకం

మడకశిరరూరల్: బోరు బావుల కింద ఉద్యాన పంటల సాగు రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని నీటి సౌకర్యం ఉన్న రైతులు ఉద్యాన పంటలను సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమణ తెలిపారు. ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం జీవీ పాళ్యం గ్రామంలో ఉద్యాన రైతు పొలాల్లో వైస్ చాన్స్‌లర్ టు విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో రైతులు సాగు చేసిన వివిధ ఉద్యాన పంటలను సందర్శించి పంటల ఏ పద్ధతుల్లో సాగు చేస్తారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణ, ఇంటి పరిసరాల్లో పెరటి తోటల సాగుకు ఆకుకూర విత్తనాలు, మునుగు మొక్కలు అందించారు. ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా ఉద్యాన పంటలను సాగు చేసి మంచి దిగుబడులు పొందాలన్నారు. ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తుందన్నారు. ఉద్యాన పంటల సాగు చేయు రైతులకు ఆర్బీకే సిబ్బంది సూచనలు, సలహాలు అందిస్తారని వారి సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే ఇన్‌చార్జ్ శైలజ, పీడీ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



పెరటి తోటల సాగుకు విత్తనాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ రమణ

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి



పెనుకొండ: మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, పార్టీ శ్రేణులు



హిందూపురం: మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక, పార్టీ శ్రేణులు

సామాజిక అసమానతలపై అలుపెరుగని పోరాటం చేసి, అణగారిన వర్గాల విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన సంఘ సంస్కర్త, విద్యా ప్రదాత మహాత్మ జ్యోతిరావు పూలే అని పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ, హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక అన్నారు. మంగళవారం పెనుకొండ, హిందూపురం పట్టణాల్లో జరిగిన పూలే వర్ధంతి కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. మరోవైపు మడకశిరలోనూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు పూలే విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు.

– సాక్షి బృందం



మడకశిర: జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వ్యక్తికి గాయాలు

అగళి: మండల పరిధిలోని ఇరిగేపల్లిలోని హైవే రోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగప్ప అనే యువకుడికి గాయాలయ్యాయి. గంగప్ప ద్విచక్ర వాహనంలో ఇరిగేపల్లి హైవేపై వస్తున్నాడు. దినేష్ అనే యువకుడు సిర నుంచి పావగడ వైపు మారుతీ వ్యాన్‌లో వెళ్తూ ఇరిగేపల్లి వద్ద గంగప్పను ఢీకొన్నాడు. గాయాలపాలైన గంగప్పను ఆస్పత్రికి తరలించారు.